ఐదోరోజు ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 8: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. శనివారం భౌతిక, రసాయన శాస్త్రం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 9.30 గంటల నుంచి మధ్నాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరిగింది. సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్, రామచంద్రాపురంలోని జడ్పీ హైస్కూల్, జహీరాబాద్‌లోని సిద్ధార్థ హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. 173 మందికి 126 మంది హాజరుకాగా, 47 మంది గైర్హాజరయ్యారు. 72.83 శాతం హాజరు నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

సెక్యులరిజానికే పట్టం

- దేవుడి పేరిట రాజకీయాలను తిరస్కరించారు
- ప్రజల విశ్వాసం మేరకు పనిచేస్తా..
- ప్రజా సమస్యల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం
- జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్



ఇంటర్వ్యూ

నారాయణఖేడ్, జూన్ 8: దేవుడి పేరిట రాజకీయాలు చేసినా.. ప్రజలు సెక్యులరిజానికే పట్టం కట్టారని జహీరాబాద్ ఎంపీగా రెండోసారి ఎంపికైన సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. ఎంపీ ఎన్నికల్లో తాను నరేంద్రమోదీతోనే పోటీ చేసి గెలుపొందానని.. తనకు బీబీపాటిల్ పోటీ కాదని స్పష్టం చేశారు. ఎంపీగా విజయం సాధించిన అనంతరం తొలిసారి ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ పలు ఆసక్తికరమైన విషయాలు పంచుకున్నారు.

జహీరాబాద్ ఎంపీగా రెండోసారి ఎంపికైన మీకు అభినందనలు. ప్రజల తీర్పుపై మీ స్పందన ఏంటి?

ఎంపీ: రెండోసారి గెలుపొందడం పట్ల చాలా ఆనందంగా ఉంది. ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు గల ఎంపీ సీట్లలో కాంగ్రెస్‌పార్టీ తరఫున నేను ఒక్కడినే గెలిచాను. జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు చైతన్యవంతులైనందున, అభివృద్ధిని, సంక్షేమాన్ని కాంక్షించి నాకు రెండోసారి గెలిపించారు. నా గెలుపునకు కృషి చేసిన ఏడు నియోజకవర్గాల్లోని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా.

బీజేపీ అభ్యర్థి దూకుడు ప్రచారం చేయడతో ఇబ్బంది కలగలేదా ?

బీజేపీవారు రాముడి పేరిట రాజకీయం చేయడం మంచిది కాదు. ఆ పార్టీ దేవుడి పేరుతో ప్రజల్లో విభేదాలు సృష్టించినప్పటికీ యువత అర్థం చేసుకొని సెక్యులర్ విధానాలతో ముందుకు సాగుతున్న మా పార్టీకే కట్టారు. బీజేపీ ఫైజాబాద్ నియోజకవర్గంలో రాముడి పేరిట రాజకీయాలు చేసినప్పటికీ ఆ పార్టీ అభ్యర్థి ఓటమి చవిచూడక తప్పలేదు. అక్కడ ఇండియా కూటమి అభ్యర్థి గెలుపొందారు. ఈ ఫలితం ద్వారా మోదీ నిజస్వరూపాన్ని ప్రజలు బయటపెట్టారు.

మీ విజన్ ఏమిటి ?

నేను మొదటిసారి ఎంపీగా గెలిచిన సమయంలో సంగారెడ్డి ఆకోలా రహదారికి ప్రతిపాదనలు చేసి ప్రభుత్వం ద్వారా జీవో విడుదల చేయించాను. నిజాంపేట, బీదర్ రహదారి అభివృద్ధికి కూడా కృషి చేశాను. అయితే ప్రస్తుతం నత్తనడకన సాగుతున్న ఈ పనులను వేగవంతం చేసేందుకు కృషి చేస్తా. అంతే కాకుండా నియోజకవర్గ పరిధిలో జాతీయ రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తా.

పరిశ్రమల ఏర్పాటు ఏమైనా చర్యలు తీసుకుంటారా ?

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే గతంలో మా ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జహీరాబాద్ ప్రాంతంలో నిమ్జ్ తీసుకువచ్చాం. మళ్లీ ఆ పనులు వేగవంతం చేయించి, పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తా. అంతే కాకుండా సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారసభలో 2వేల ఎకరాల భూములు సమకూరిస్తే ఫార్మా క్లస్టర్‌ను ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. అందువల్ల నారాయణఖేడ్, జుక్కల్ నియోజకవర్గాల్లో భూములను సేకరించి, ఈ నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తా.

బోధన్ - బీదర్ రైల్వేలైన్ ఏర్పాటుపై మీ ప్రణాళిక ఏమిటి?

మొదటిసారిగా ఎంపీగా ఎన్నికైన సమయంలోనే బోధన్ - బీదర్ రైల్వే లైన్ కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు చేసి, సర్వే పనులు పూర్తి చేయించాను. అనంతరం రెండుసార్లు ఎంపీగా ఎన్నికైన బీబీపాటిల్ ఈ రైల్వేలైన్ గురించి పట్టించుకోలేదు. అయినప్పటికీ తిరిగి బోధన్ - బీదర్ రైల్వే లైన్ కోసం ప్రయత్నాలు చేస్తా.

ఎన్నికల సందర్భంగా క్రాస్ ఓటింగ్ ఇబ్బందులు కలిగించిందా ?

ఎన్నికల సమయంలో బీబీపాటిల్ బీఆర్ఎస్ పార్టీ నుంచి బీజేపీలో చేరి పోటీ చేశారు. బీఆర్ఎస్ వారు క్రాస్ ఓటింగ్ చేయడంతో మాకు ఆశించిన మెజార్టీ రాలేదు. లేదంటే భారీ మెజార్టీ వచ్చేది.

తొలిసారి ఎంపీగా ఎన్నికైనప్పుడు అధికార పక్షంలో పనిచేశారు.. ప్రస్తుతం ప్రతిపక్షంలో ఉన్నందున అభివృద్ధికి ఎలా కృషి చేస్తారు ?

నేను మొదటిసారి కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఎంపీగా ఎన్నికైనప్పటికీ, తెలంగాణ సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి రాష్ట్రాన్ని సాధించాం. మా పార్టీ సిద్ధాంతాలతో కూడుకున్న పార్టీ. అందువల్ల ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తా. నేను మొదటిసారిగా ఎంపీగా ఎన్నికైన సమయంలోనే నియోజకవర్గంలోని నారాయణఖేడ్, ఎల్లారెడ్డిలలో మోడల్ డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయించాను. జహీరాబాద్ పరిధిలో కేంద్రీయ విద్యాలయాన్ని తీసుకువచ్చాను. 15 మోడల్ పాఠశాలలను కూడా ఏర్పాటు చేయించా. ప్రధానంగా విద్యా, ఉపాధి, అభివృద్ధికి ప్రాధాన్యతను ఇస్తాను.

బియ్యం ఇవ్వడం లేదంటూ రేషన్ దుకాణానికి తాళం



రేషన్ దుకాణానికి తాళం వేస్తున్న గ్రామస్థులు

మనూరు, జూన్ 8: పేదలకు కడుపునిండా అన్నం పెట్టాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యం సక్రమంగా పంపిణీ చేయడం లేదంటూ మనూరు మండలం దుద్దగొండ గ్రామస్థులు శనివారం రేషన్ దుకాణానికి తాళం వేసి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి నెలా బియ్యం సరఫరా అవుతున్నా స్థానిక డీలర్ మాత్రం తమకు కోటా రాలేదంటూ బియ్యం ఇవ్వకపోవడమేంటని ప్రశ్నించారు. బియ్యం విషయంపై గ్రామస్థులు మనూరు తహసీల్దార్‌ను ఫోన్‌లో అడగ్గా.. గ్రామస్థులకు సరిపడే బియ్యం సరఫరా అవుతున్నాయని, దీనిపై విచారణ జరిపి డీలర్‌పై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ఎట్టకేలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలల ప్రారంభానికి ముందే ఈ ప్రక్రియ పూర్తిచేస్తామని ఇదివరకే ప్రభుత్వం స్పష్టం చేసింది. కానీ, ఎలక్షన్ కోడ్ కారణంగా ముందుకు సాగలేదు. ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో ప్రభుత్వం ఆ ప్రక్రియను ప్రారంభించింది. టెట్‌తో సంబంధం లేకుండా ఈసారి పదోన్నతులు కల్పించనున్నారు. గతేడాది వివిధ కారణాలతో అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రక్రియ తిరిగి అక్కడి నుంచే ప్రారంభించనున్నారు. మూడేళ్ల లోపు పదవీ విరమణ చేయనున్న టీచర్లకు తప్పనిసరి బదిలీ నుంచి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది.

జడ్పీ మేనేజ్‌మెంట్‌లో హెడ్‌మాస్టర్లుగా (గ్రేడ్-2) పదోన్నతి కోసం స్కూల్ అసిస్టెంట్లు, తత్సమానమైన కేడర్ పోస్టులకు సంబంధించి ప్రొవిజనల్ సీనియారిటీ జాబితాను 8న ప్రదర్శించారు.

- ప్రక్రియ ప్రారంభించిన విద్యాశాఖ
- 23 రోజుల పాటు కొనసాగనున్న ప్రక్రియ
- టెట్‌తో సంబంధం లేకుండా టీచర్లకు పదోన్నతులు
- ఇదే షెడ్యూల్‌లో పండిత్, పీఈటీల అప్‌గ్రేడేషన్



బదిలీలు, పదోన్నతులకు

వేళాయే..

సంగారెడ్డి అర్బన్, జూన్ 8 : విద్యాశాఖ తాజాగా విడుదల చేసిన బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌లో భాగంగా (మల్టీజోన్-2) ఈ నెల 8న జడ్పీ మేనేజ్‌మెంట్‌లో హెడ్‌మాస్టర్లుగా (గ్రేడ్-2) పదోన్నతి కోసం స్కూల్ అసిస్టెంట్లు లేదా దానికి సమానమైన కేడర్ పోస్టులకు సంబంధించిన ప్రొవిజనల్ సీనియారిటీ జాబితా ప్రదర్శించారు. 9న అభ్యంతరాల స్వీకరణ, 10, 11 తేదీల్లో ఫైనల్ సీనియారిటీ జాబితా, వెబ్ ఆప్షన్లు, హెడ్‌మాస్టర్లుగా పదోన్నతి ఉత్తర్వుల జారీ ఉంటుంది. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి కోసం ఎస్జీటీలు, దానికి సమానమైన కేడర్ ప్రొవిజనల్ సీనియారిటీ జాబితా ప్రదర్శన కూడా 10, 11 తేదీల్లో ఉంటుంది. 12, 13 తేదీల్లో పదోన్నతుల తర్వాత ఎస్ఏల ఖాళీల వివరాలను వెల్లడిస్తారు. 14న ఎస్ఏల సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 15న స్కూల్ అసిస్టెంట్లకు ఆన్‌లైన్‌లో పదోన్నతుల ఉత్తర్వులు అందజేస్తారు. అనంతరం 16 నుంచి 18 వరకు ఎస్ఏల బదిలీలకు ఫైనల్ సీనియారిటీ జాబితా ప్రదర్శన, వెబ్‌ఆప్షన్లు, 19న స్కూల్ అసిస్టెంట్ల బదిలీ ఉత్తర్వులు వెల్లడిస్తారు. 20న బదిలీల అనంతరం మిగిలిన ఎస్ఏ ఖాళీల వెల్లడి, 21 నుంచి 24 వరకు స్కూల్ అసిస్టెంట్ ఫైనల్ సీనియారిటీ జాబితా వెల్లడి, ఎస్జీటీల పదోన్నతులు, 25న ఎస్జీటీల ఖాళీల వెల్లడి, 26 నుంచి 28 వరకు ఫైనల్ సీనియారిటీ జాబితా, వెబ్ ఆప్షన్ల స్వీకరణ, ఎడిట్ ఆప్షన్, 29, 30 తేదీల్లో ఎస్జీటీల బదిలీ ఉత్తర్వుల జారీ చేయనున్నారు. మొత్తంగా 23 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనున్నది.

పండిత్, పీఈటీలకు పదోన్నతులు

కొన్నేళ్లుగా భాషా పండితులు, పీఈటీల అప్‌గ్రేడేషన్ సమస్య కారణంగా పదోన్నతులు నిలిచిపోయాయి. పండిత్‌లకు చివరగా 2012లో పదోన్నతి కల్పించగా, పీఈటీలకు చివరిసారి 2015 పదోన్నతులు ఇచ్చారు. ఉన్నత పాఠశాలల్లో పండిత్, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్ కోసం ఏళ్లుగా కొట్లాడిన పండితులు తదనంతరం కోర్టు కేసుల కారణంగా పదోన్నతులు లేకుండాపోయాయి. అప్‌గ్రేడేషన్ పోస్టుల కోసం సుమారు పదేళ్లుగా కొట్లాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన తెలుగు మహాసభల్లో భాషా పండిత్‌లందరికీ స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు.

ఇదే సమయంలో పలువురు ఎస్జీటీలు కోర్టును ఆశ్రయించడంతో సమస్య కొలిక్కి రాకుండాపోయింది. ఇటీవల హైకోర్టు పండిత్‌లు, పీఈటీలకు అనుకూలంగా పండితుల పోస్టులు పండితులకే పదోన్నతులు ఇవ్వాలని తీర్పునిచ్చింది. దీంతో సమస్య కొలిక్కి వచ్చింది. తాజాగా పదోన్నతులతో పండిత్, పీఈటీలకు పదోన్నతులు దక్కనున్నాయి. సంగారెడ్డి జిల్లాలో భాషాపండితులు 398 మంది, పీఈటీ 77 మంది అప్‌గ్రేడ్ కానున్నట్లు విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

గత షెడ్యూల్‌లో 92 మంది బదిలీ

జిల్లాలో గతేడాది జరిగిన గెజిటెడ్ హెచ్ఎం బదిలీల్లో ప్రభుత్వ యాజమాన్య పరిధిలో ఆరుగురు, జడ్పీ హైస్కూల్(లోకల్‌బాడీ)పరిధిలో 86 మంది, ఈ విధంగా మొత్తం 92 మంది జీహెచ్ఎంలు బదిలీ అయ్యారు. ఇతర జిల్లాల నుంచి 11 మంది జీహెచ్ఎంలు బదిలీపై జిల్లాకు వచ్చారు. జీహెచ్ఎంల బదిలీ తర్వాత ప్రభుత్వ యాజమాన్య పరిధిలో 8, జడ్పీ యాజమాన్య పరిధిలో 61 ఖాళీగా ఏర్పడ్డాయి. అనంతరం ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో 13 మంది స్కూల్ అసిస్టెంట్లు.. జీహెచ్ఎం (గ్రేడ్-2)గా పదోన్నతి పొందారు. ఇతర జిల్లాల నుంచి ఐదుగురు జీహెచ్ఎంలు పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. అలాగే, జిల్లా నుంచి 80 మంది స్కూల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. కోర్టులో టెట్ అర్హతకు సంబంధించిన కేసు కొనసాగుతుండడంతో జడ్పీ యాజమాన్య పరిధిలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులకు బ్రేక్ పడడం, ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికలకోడ్ అమలులోకి రావడంతో బదిలీలు, పదోన్నతులు నిలిచిపోయాయి. కాగా, జిల్లాలో 5,947 టీచర్ పోస్టులు మంజూరై ఉండగా, ఇందులో ప్రస్తుతం 868 ఖాళీలు ఉన్నాయి.



సంగారెడ్డిలో మెగా లోక్‌అదాలత్‌లో కక్షిదారులకు తీర్పు కాపీని అందజేస్తున్న జిల్లా న్యాయాధికారి భవనీచంద్ర, న్యాయమూర్తులు



మెదక్ జిల్లా కోర్టులో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద

లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం

- సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రధాన న్యాయాధికారులు
- సంగారెడ్డి జిల్లాలో 3,059, మెదక్ జిల్లాలో 2,302 కేసుల పరిష్కారం

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్, జూన్ 8: లోక్‌అదాలత్ ద్వారా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులకు సత్వర న్యాయం లభిస్తుందని సంగారెడ్డి, మెదక్ జిల్లాల ప్రధాన న్యాయాధికారులు పేర్కొన్నారు. జాతీయ న్యాయ సేవాధికర సంస్థ, రాష్ట్ర సేవాధికార సంస్థ ఆదేశాలమేరకు శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయా జిల్లాల పరిధిలోని కోర్టుల్లో పలు కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా రాజీ పడదగిన కేసుల్లో ఇరుపక్షాల అంగీకారంతో అప్పీలుకు అవకాశం లేని తుది తీర్పు పొందవచ్చని చెప్పారు. చిన్నచిన్న సమస్యలకు కోర్టుల చుట్టూ తిరిగి వ్యయ ప్రయాసలకు లోనయ్యేకంటే రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకుంటే ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. లోక్‌అదాలత్‌లో పెండింగ్ కేసులకు పరిష్కారం దొరుకుతుందన్నారు. కాగా, సంగారెడ్డి జిల్లాలో 3,059 కేసులను పరిష్కరించినట్టు అధికారులు తెలియజేశారు. సంగారెడ్డి కోర్టులో జిల్లా న్యాయాధికారి భవనీచంద్ర అధ్యక్షతన జరిగిన లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ద్వారా రాజీ కుదిర్చారు. లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 2,832 క్రిమినల్ కేసులు, 15 మోటార్ వెహికిల్ కేసులు, 8 సివిల్ కేసులు, 143 విద్యుత్‌చౌర్యం కేసులు, 55 ఇతర కేసులు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బి.రమేష్, న్యాయమూర్తులు జయంతి, సునీత, కృష్ణార్జున, లావణ్య, రవీందర్‌రెడ్డి, రాధాకృష్ణ చౌహాన్, లక్ష్మణాచారి, తేజశ్రీ, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో..

మెదక్ జిల్లావ్యాప్తంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,302 కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద తెలిపారు. మెదక్ కోర్టు ఆవరణలో లోక్‌అదాలత్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. పెండింగ్ కేసులను పరిష్కరించి సత్వరన్యాయం అందించడానికి లోక్‌అదాలత్ ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో పలు కేసుల్లో బాధితులకు రూ.46,63,773 నష్టపరిహారం ఇప్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, జూనియర్ సివిల్ జడ్జి రీటాలాల్‌చంద్, సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ సిద్దయ్య స్వాతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చేపలకు భలే డిమాండ్

మృగశిర ఎఫెక్ట్.. బొచ్చ, రవ్వ కిలో రూ. 300, కొర్రమొట్ట కిలో రూ. వెయ్యి



పెద్దశంకరంపేటలో చేపను చూపుతున్న మత్స్యకారుడు

నారాయణఖేడ్/హత్నూర/పెద్దశంకరంపేట, జూన్ 8: మృగశిర కార్తె ప్రవేశంతో శనివారం జిల్లావ్యాప్తంగా చేపల మార్కెట్లు జనంతో కిటకిటలాడాయి. చేపలకు డిమాండ్ పెరగడంతో ధరలు రెట్టింపయ్యాయి. అయినా కొనుగోలుదారులు వెనక్కి తగ్గలేదు. నారాయణఖేడ్‌లో మొన్నటి వరకు కొర్రమొట్ట రకం చేపలు కిలో రూ.500లకు విక్రయించగా శనివారం రూ. 800 నుంచి రూ.1,000 వరకు విక్రయించారు. బొచ్చ, రవ్వ, బంగారు తీగ తదితర చేపల సాధారణ ధర కిలో రూ. 200 కాగా, ప్రస్తుతం రూ.300 వరకు విక్రయించారు. ధరలు పెరిగినా కొనుగోలుదారులతో చేపల మార్కెట్లు కిటకిటలాడాయి. చేపలను శుభ్రం చేసేవారు కూడా రెండితలు తీసుకున్నారు. గతంలో కిలోకు రూ.20కే చేపలను శుభ్రం చేసిఇచ్చేవారు. మృగశిర రోజు రూ.50 తీసుకున్నారు. హత్నూర మండలం దౌల్తాబాద్‌లో చేపలు కిలో రూ.150 నుంచి రూ. 650 వరకు ధర పలికింది. పెద్దశంకరంపేటలో కొర్రమొట్టలు రూ.700, సాధారణ చేపలు కిలో రూ. 250 వరకు ధరలు పలికాయి.



హత్నూరలో మార్కెట్‌లో రద్దీ

నేడే గ్రూప్-1 ప్రిలిమ్స్

- నిమిషం ఆలస్యమైనా ఇంటికే
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన యంత్రాంగం
- 10.30 నుంచి 1 వరకు నిర్వహణ
- సంగారెడ్డి జిల్లాలో 16, మెదక్‌లో 10 పరీక్షా కేంద్రాలు
- రెండు జిల్లాల్లో పరీక్ష రాయనున్న 13,584 అభ్యర్థులు



సంగారెడ్డిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

సంగారెడ్డి అర్బన్/ మెదక్ అర్బన్, జూన్ 8: ఈ నెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష కోసం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులకు తలెత్తకుండా ఇప్పటికే పలుమార్లు అధికారులతో సమావేశాలు నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాలు ఏర్పాటు చేయగా, 9,672 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారు. మెదక్ జిల్లాలోని మెదక్, నర్సాపూర్‌లలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా 3,912 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్నది. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రమే అభ్యర్థులను లోనికి అనుమతిస్తారు. ఆ తర్వాత నిమిషం ఆలస్యమైనా అనుమతించరు. పరీక్ష కేంద్రానికి హాజరు కాగానే బయోమెట్రిక్ హాజరు తీసుకొని హాల్‌లోకి పంపిస్తారు. ప్రతీ సెంటర్‌లో సీసీ కెమెరాల నిఘా ఉంటుంది. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, క్యాలిక్యులేటర్లు, స్మార్ట్ వాచీలు ఇతరత్రా ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఫొటో గుర్తింపు కార్డులలో ఏదో ఒకటి తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు షూస్, సాక్స్ కాకుండా కేవలం చెప్పులు మాత్రమే ధరించాలి. దివ్యాంగులకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పరీక్ష నిర్వహణకు పోలీస్ శాఖ తరఫున అన్ని రకాల భద్రత ఏర్పాట్లు చేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.



మంబోజిపల్లి గీతా స్కూల్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కట్టుదిట్టమైన ఏర్పాట్లు : మెదక్ కలెక్టర్

మెదక్ జిల్లాలో జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం మెదక్, మంబోజిపల్లిలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. పకడ్బందీ నిర్వహణపై ఇన్విజిలేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించి పలు సూచనలు చేశారు.

ప్రయాణికుల భద్రతకు ఆటో డ్రైవర్లు ప్రాధాన్యమివ్వాలి

జిన్నారం, జూన్ 9: ఆటోలలో సురక్షిత ప్రయాణాల కోసం డ్రైవర్లు కృషి చేయాలని జిన్నారం సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ విజయ్‌రావు అన్నారు. శనివారం జిన్నారం పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు సురక్షిత ప్రయాణంపై సీఐ, ఎస్ఐ అవగాహన కల్పించారు. ఆటోలు ప్రయాణించే మార్గాలను సూచించే షై ఆటో ఈజ్ సేఫ్ స్టిక్కర్లను వారికి అందజేశారు. ప్రయాణికుల భద్రతకు ఆటో డ్రైవర్లు అధిక ప్రాధాన్యమివ్వాలని అవగాహన కల్పించారు.



జిన్నారంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ సుధీర్‌కుమార్, ఎస్ఐ విజయ్‌రావు

10న ఇంగ్లిష్ సబ్జెక్టులో ప్రాక్టికల్ పరీక్ష

మెదక్ అర్బన్, జూన్ 8: ఇప్పటి వరకు ఇంటర్ ఒకేషనల్ కాకుండా జనరల్ సబ్జెక్టుల్లో కేవలం సైన్స్, మ్యాథ్స్‌లోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇక నుంచి ఇంగ్లిష్ సబ్జెక్టులోనూ ప్రాక్టికల్‌ను ప్రభుత్వం నిర్వహించనుంది. ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థుల్లో ఇంగ్లిషు భాషపై నైపుణ్యం పెంపొందించేందుకే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ నెల 10న ప్రాక్టికల్ పరీక్ష జరుగనుంది. ఉదయం 9 గంటల నుంచి జరిగే ఈ పరీక్షకు 223 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు ఇంటర్ జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ తెలిపారు. 11న పర్యావరణ, 12న నైతికత, మానవ విలువలుపై పరీక్షలు జరుగుతాయన్నారు.




నంగునూర్ మండలంలోని అక్కేనపల్లి గ్రామంలో సాగయిన ఆయిల్ పామ్ పంట, కోతకు సిద్ధంగా ఉన్న ఆయిల్ పామ్ గెలలు

కోతకొచ్చిన ఆయిల్ పామ్ పంట

- నంగునూర్ మండలంలో నేడు 20 ఎకరాల్లో కోత
- 3 టన్నుల దిగుబడి రానున్నట్టు అంచనా
- రెండు మూడు నెలల్లో వెయ్యి ఎకరాల్లో పంట చేతికి
- సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 11,118 ఎకరాల్లో సాగు

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 8: సిద్దిపేట జిల్లాలో 2021 జూన్ 5న నాటిన ఆయిల్‌పామ్ మొక్కలు మొదటి కోతకొచ్చాయి. అధిక ఆదాయం, తక్కువ పెట్టుబడి ఉండే ఆయిల్‌పామ్ సాగుకు గత ప్రభుత్వం ప్రోత్సహించగా.. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు రైతులకు అనేక అవగాహన సదస్సులు నిర్వహించి సిద్దిపేట జిల్లాలో ఆయిల్ పామ్ సాగుకు కృషి చేశారు. జిల్లాలోని నంగునూరు మండలంలో మొదటగా మొక్కలు నాటగా.. 20 ఎకరాల్లో పంట కోతకు వచ్చింది. ఈ నెల 9న పంటను కోసి, అశ్వరావుపేటకు ఆయిల్ ఫెడ్ అధికారులు తీసుకెళ్లనున్నారు. రవాణా ఖర్చులు కూడా ఆయిల్ ఫెడ్ అధికారులే భరిస్తారు. దాదాపు 3 టన్నుల దిగుబడి రానున్నట్టు ఉద్యానశాఖ, ఆయిల్ ఫెడ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పామాయిల్ టన్ను ధర రూ.13 వేలకు పైగానే ఉన్నది. తొలిసారి పంటకు ఇంత మంచి ధర వచ్చినందుకు రైతులు సంబురపడతున్నారు. ప్రతి ఆయిల్‌పామ్ చెట్టుకు 18నుంచి 20 గెలలు ఉన్నాయి. ఒక్కొక్క గెల ఐదు నుంచి 15 కేజీల వరకు ఉంటుంది. జిల్లాలో 11,118 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగులో ఉండగా.. మరో రెండు, మూడు నెలల్లో 1,000 ఎకరాల్లో పంట చేతికి రానున్నది. జిల్లావ్యాప్తంగా తొలి విడతగా 2,700 ఎకరాల్లో మొక్కలు నాటగా.. ఈ ఏడాది 8 వేల ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 3,350 మంది రైతులు 11,118 ఎకరాలలో పామాయిల్ సాగు చేస్తున్నారు. మార్చి నాటికి మొత్తం 2,700 ఎకరాల్లో మొదటగా సాగుచేసిన వారి పంట దిగుబడి రానున్నది.

తొలిసారి పంటను కోస్తున్న



నేను ఏడెకరాల్లో ఆయిల్‌పామ్ పంటను సాగు చేశాను. మొదటగా 5 ఎకరాలు, మరో ఏడాదికి రెండు ఎకరాల్లో పంటను సాగు చేశాను. ప్రభుత్వం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ ఇచ్చారు. మందుల వాడకానికి ఎకరానికి రూ.4 వేల చొప్పున నా ఖాతాలో జమ చేశారు. మూడేళ్ల నుంచి 30 ఏళ్లదాకా దిగుబడి వస్తుందంటే ఈ పంట వేసిన. కోతులు, అడవి పందుల బెడద కూడా తప్పింది. పంటను కోతకు వచ్చిందని అధికారులు చెప్పడంతో నేడు తొలిసారి పంటను కోస్తున్నాను.

- తిప్పని నాగేందర్, అక్కేనపల్లి, నంగునూరు మండలం

మంత్రి దామోదర్ చొరవతో
సింగూరు కాల్వలకు సీసీ లైనింగ్



ఉత్తర్వుల ప్రతిని చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

జోగిపేట/పుల్‌కల్, జూన్ 8: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవతో సంగారెడ్డి జిల్లా అందోలు నియోజకవర్గ వరప్రదాయిని సింగూరు కాల్వలకు మరో మహర్దశ పట్టింది. సుమారు 70 వేల ఎకరాలకు సాగు నీరందించే ఈ కాలువలను సిమెంటు లైనింగ్ చేసేందుకు ప్రభుత్వం రూ.168.30 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సింగూరు కాలువల సిమెంటు లైనింగ్‌కు నిధులు మంజూరు కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అందోలు నియోజకవర్గంలోని పుల్కల్, చౌటకూరు, అందోలు, మునిపల్లి మండలాలతోపాటు, సంగారెడ్డి నియోజకవర్గ పరిధిలోని సదాశివపేట మండలంలో సుమారు 70 వేల ఎకరాలకు సింగూరు ప్రాజెక్టు నుంచి కుడి ఎడమ కాల్వల ద్వారా ఏటా సుమారు 2 టీఎంసీల నీరు విడుదల అవుతుంది. కాల్వలకు సిమెంట్ లైనింగ్ లేకపోవడంతో వానలతోపాటు కాల్వల ద్వారా నీటివపారుదల సమయంలో కాల్వల గట్లు తడిసి మట్టి జారిపోయి కూలిపోతున్నాయి. ఈ విషయాన్ని గమనించిన మంత్రి దమోదర్ వాటి పటిష్టతకు సిమెంట్ లైనింగ్ చేయించాలని నిర్ణయించారు. ఈ మేరకు నీటిపారుదల శాఖ అధికారుల ద్వారా ప్రతిపాదనలు తయారు చేయించి ప్రభుత్వానికి పంపారు. సిమెంట్ లైనింగ్ ఆవశ్యకతను మంత్రి దామోదర్ సీఎం రేవంత్‌రెడ్డికి వివరించి ఆయనతో గ్రీన్ సిగ్నల్ ఇప్పించుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సింగూరు కాల్వల లైనింగ్ కోసం రూ.168.30 కోట్లు నిధులు విడుదల చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. నిధుల విడుదల పట్ల రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శేరి జగన్మోహన్‌రెడ్డి, పుల్‌కల్ మండల సీనియర్ నాయకుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ రాంసాని రామచంద్రారెడ్డి, పుల్కల్, చౌటకూర్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు మల్లన్నగారి దుర్గారెడ్డి, నత్తి దశరథ్, నాయకులు మల్లారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్, సురేందర్‌గౌడ్, బోయిని శ్రీనివాస్, అంజయ్య ఉదయ్, ఇమ్రాన్, రవీందర్, గణపతి, దామోదర్, ప్రభుగౌడ్ మంత్రికి ధన్యావాదాలు తెలిపారు.

బెల్టుషాపులపై చర్యలు తీసుకోండి

- ఎక్సైజ్ అధికారులకు చిట్యాల గ్రామ మహిళల వినతి
- తాగిన మైకంలో దాడులు చేస్తున్నారని ఏకరువు

చేర్యాల, జూన్ 8: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం చిట్యాల గ్రామంలో నిర్వహిస్తున్న బెల్టుషాపులపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మహిళలు కోరతున్నారు. అడ్డగోలుగా జరుపుతున్న మద్యం విక్రయాలు తమ సంసారాల్లో చిచ్చుపెడుతున్నాయని వాపోయారు. తమ కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న విషయమై మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్టుషాపులను మూసివేయించి, గ్రామంలో మద్యం అమ్మకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ పలువురు మహిళలు శనివారం పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులను ఆశ్రయించారు. మొదటగా చేర్యాల పోలీస్‌స్టేషన్‌కు వెళ్లగా తామేం చేయలేమని, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయాలని పోలీసులు సలహా ఇవ్వడంతో మహిళలంతా ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామంలోని బెల్టుషాపుల్లో సమయపాలన అనేది లేకుండా ఇష్టానుసారంగా మద్యం విక్రయిస్తుండడంతో మందుబాబులు తాగిన మైకంలో అనర్థాలకు పాల్పడుతున్నారని వాపోయారు. కుటుంబ కలహాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం విక్రయాలు నివారిస్తేనే కుటుంబాలు బాగుపడతాయని పేర్కొంటూ, బెల్ట్‌షాపులు మూసివేయించాలని ఎక్సైజ్ అధికారులను కోరారు.



చేర్యాల ఎక్సైజ్ కార్యాలయానికి తరలివచ్చిన చిట్యాల మహిళలు

చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నిందితుడి అరెస్టు

- జల్సాలకు అలవాటుపడి దొంగతనాలు
- జైలుకు వెళ్లొచ్చినా మారని బుద్ధి

అక్కన్నపేట, జూన్ 8: వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నిందితుడిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట ఎస్ఐ తాండ్ర వివేక్ శనివారం పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, వివరాలు వెల్లడించారు. యాదాద్రి-భువనగిరి జిల్లా మోత్కూర్‌కు చెందిన సిరిగిరి సాయిబాబా అలియాస్ సాయికుమార్ మద్యానికి, గంజాయికి బానిసగా మారి, సులువుగా డబ్బు సంపాదించడం కోసం దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. గతంలో కరీంనగర్, వరంగల్, నల్గొండ, హుజుర్‌నగర్, జనగాం, భువనగిరి జిల్లాల్లో దొంగతనాలు చేసి జైలుకు వెళ్లాడు. జైలు నుంచి విడుదలై వచ్చినా బుద్ధి మార్చుకోక మళ్లీ దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. ఈ క్రమంలోనే గత నెల 19న అక్కన్నపేట మండలం అంతకపేట గ్రామంలో కనకయ్య ఇంట్లోకి చొరబడి బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించాడు. గంగాధర మండలం వెంకటాయపల్లి స్టేజి వద్ద బైక్‌ను, మల్లంపల్లి గ్రామ పాఠశాలలో నల్ల పైపులను చోరీ చేశాడు. అంతకపేట గ్రామంలో చోరీ చేసిన సొమ్మును అమ్మేందుకు కొండగట్టుకు వెళ్లిన సాయిబాబా అక్కడ తన స్నేహితుడైన గంధం అర్జున్‌ను కలిశాడు. సొమ్మును అమ్మి పెట్టాలని చెప్పగా అర్జున్ రూ.60 వేలకు అమ్మి అందులో రూ.పదివేలు తాను తీసుకుని, మిగిలిన డబ్బును సాయిబాబాకు ఇచ్చాడు. ఆ డబ్బును సాయిబాబా జల్సాలకు ఖర్చు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. శనివారం ఉదయం 5గంటల సమయంలో తన భార్య, పిల్లలను చూసేందుకు బైక్‌పై వెళ్తున్న సాయిబాబా అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు పట్టుకుని విచారించగా దొంగతనం చేసినట్లు తేలింది. నిందితుడి నుంచి 3 తులాల బంగారం, 16.6 తులాల వెండి, బైక్, రూ.వెయ్యి నగదును స్వాధీనం చేసుకుని, హుస్నాబాద్ కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ వివేక్ తెలిపారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ తాండ్ర వివేక్

రాజ్యాంగాన్ని గౌరవిస్తేనే ప్రభుత్వాల మనుగడ

- కేంద్రంలో ఎన్డీయే మనుగడ కష్టమే
- కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

జహీరాబాద్, జూన్ 8: దేశంలో పాలకులు రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, లౌకికవాదాన్ని అంగీకరించినప్పుడే ప్రభుత్వాల మనుగడ సాధ్యమని, కుల, మతాల పునాదులపై ఏర్పడిన ప్రభుత్వాల మనుగడ కష్టమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయాల్లో రౌడీయిజం, ఫ్యాక్షనిజం, క్విడ్‌ప్రోకో విధానం పనికిరాదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి జగన్ పరిస్థితిని ఇందుకు ఉదహరణగా పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజలు తలుచుకుంటే ఏమైనా చేయగలుగుతారనడానికి లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే నిదర్శనమన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు భయంతోనే బలవంతంగా ఎన్డీయే కూటమిలో చేరారన్నారు. కాంగ్రెస్ పార్టీకి విశాలమైన దృక్పథం లేదని, అందుకే కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు సరిపడ స్థానాలను సాధించలేకపోయిందని ఆయన పేర్కొన్నారు.

వెంచర్‌లో గంజాయి మొక్కల సాగు

- 12 మొక్కలను ధ్వంసం చేసిన పోలీసులు

సంగారెడ్డి టౌన్/జహీరాబాద్, జూన్ 8: వెంచర్‌లో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వీణారెడ్డి, ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్ పట్టణంలోని ఇంద్రప్రస్థాన్ పక్కనే ఉన్న తిరుమల డెవలపర్స్(వెంచర్)లో గంజాయి మొక్కలను సాగుచేస్తున్నారని నమ్మదగిన సమాచారం అందింది. శనివారం వెళ్లి తనిఖీ చేసి 12 గంజాయి మొక్కలను ధ్వంసం చేశారు. వాటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. గంజాయి మొక్కలను సాగుచేసిన రాఘవరెడ్డిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు వివరించారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ ఎండి అలీం, కానిస్టేబుళ్లు అనిల్‌కుమార్, మల్కయ్య తదితరులు పాల్గొన్నారు.



గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ఏడుపాయలలో ఇద్దరు మహిళల హత్య

- ఓ మహిళ హత్య కేసు విచారణలో మరో మహిళనూ చంపినట్లు నిందితుడి వెల్లడి

పాపన్నపేట, జూన్ 8: ఓ మహిళ మిస్సింగ్ కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడిని విచారిస్తున్న క్రమంలో సదరు మహిళతో పాటు మరో మహిళనూ హత్య చేసినట్లు చెప్పడంతో పోలీసులు కంగుతిన్నారు. శనివారం మెదక్ జిల్లా పాపన్నపేట ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా మునిపల్లికి చెందిన అనెల్లి అనసూయ(52) గత నెల 18న కనిపించకుండా పోయింది. ఆమె కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి, సదాశివపేటకు చెందిన బసవరాజ్‌ను అరెస్ట్ చేశారు. అనసూయను ఏడుపాయలకు తీసుకెళ్లి, అక్కడ మద్యం సేవించినట్లు బసవరాజ్ తెలిపాడు. ఆ తర్వాత గొడవ జరగడంతో బండరాయితో మోదీ అనసూయను చంపినట్లు అంగీకరించాడు. ఈ కేసును విచారిస్తున్న పోలీసులకు నిందితుడు మరో మహిళను హత్య చేసినట్లు చెప్పడంతో ఆ కేసును కూడా పోలీసులు విచారించారు. అతడిచ్చిన వివరాల మేరకు శనివారం ఏడుపాయలకు వెళ్లిన పోలీసులు అక్కడ కోడిగుడ్ల పోచమ్మ(40) అనే మహిళ మృతదేహాన్ని కనుగొన్నారు. సదాశివపేటకు చెందిన కోడిగుడ్ల పోచమ్మ ఏడుపాయయలోని ఓ హోటల్‌లో పనిచేసుకుంటూ జీవిస్తోంది. ఆమెకు కుమార్తె, ముగ్గురు కొడుకులు ఉన్నారు. అయితే, ఆమె 15 రోజుల క్రితం నుంచి కనిపించడం లేదు. కుటుంబీకులు సదాశివపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనసూయ మిస్సింగ్ కేసు విచారణలో నిందితుడు చెప్పిన వివరాల మేరకు పోచమ్మ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే, నిందితుడు చెప్పిన విధంగా రెండు హత్యలు 15 రోజుల క్రితమే జరిగినట్లు తేలడంతో అసలేం జరిగిందనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. నిందితుడు ఒంటరి మహిళలను టార్గెట్ చేసి చంపుతున్నాడా, లేక రెండు హత్యలు చేయడం వెనుక వేరే కారణాలు ఏమైనా ఉన్నాయ అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. కేసు విచారణ పూర్తి అయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని పోలీసులు వెల్లడించారు.


అర్బన్ పార్కుకోసం ఏర్పాటుచేసిన రిజర్వ్ ఫారెస్ట్


అర్బన్‌పార్కులో వాకింగ్ ట్రాక్


అర్బన్‌పార్కు ప్రధాన గేటు

అర్బన్‌పార్కు అభివృద్ధికి నిధుల కొరత


అర్బన్‌పార్కులో కూర్చోవడానికి ఏర్పాటుచేసిన గజేలా

- ఐదేళ్లుగా నత్తనడకన సాగిన పనులు
- అర్బన్‌పార్కు అభివృద్ధి ఊసెత్తని అధికారులు, నాయకులు
- రూ.2 కోట్లు ఖర్చుచేస్తేనే వినియోగంలోకి..

జహీరాబాద్, జూన్ 8: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రాంతం వివిధ రంగాల్లో అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అధికారులు, నాయకులు ఈ ప్రాంతంలో పెద్దపార్కును ఏర్పాటు చేసేందుకు సంకల్పించారు. బీఆర్ఎస్ హయాంలో 2019లో జహీరాబాద్ సమీపంలోని ముఖీంబాగ్‌వద్ద గల రిజర్వ్ ఫారెస్టులో అర్బన్‌పార్కు ఏర్పాటుకుగాను రూ.4 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు. జహీరాబాద్ పట్టణానికి, మహీంద్రా కర్మాగారానికి, 65వ నెంబరు జాతీయ రహదారికి రిజర్వ్ ఫారెస్టు ఆనుకుని ఉండడంతో పార్కు ఏర్పాటుకు సౌలభ్యంగా ఉంటుందని అధికారులు, నాయకులు ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నారు. వెనువెంటనే రిజర్వ్ ఫారెస్టులోని సుమారు 200 ఎకరాల భూమిని పార్కుకోసం కేటాయించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు పనులు నత్తనడకన సాగుతున్నాయి. దీంతో స్థానికులకు, పర్యాటకులకు, సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచాలనే లక్ష్యం నేరవేరడం లేదు. పార్కుతో సౌకర్యవంతంగా ఉంటుందని ఆశించిన ప్రజల ఆశలు అడియాశలవుతున్నాయి. పార్కు ఏర్పాటుతో రోడ్డు గుండా వచ్చిపోయే వారు కాకుండా పరిసర గ్రామాలైన జహీరాబాద్, బూచనెల్లి, బూడ్డిపాడ్, దిడిగి, కొత్తూర్(బి), ఖాశీంపూర్, తూంకుంట తదితర ప్రాంతాల ప్రజలకు ప్రయోజనకరంగా మారనుంది. అందులో భాగంగా గతంలో రూ.2 కోట్లను కేటాయించగా పార్కులో వివిధరకాల అభివృద్ధి పనులను చేశారు. అందులోంచి పార్కు చుట్టుపక్కల మూడు కిలోమీటర్ల మేర కంచెను వేసేందుకు రూ.90 లక్షలు, కిలోమీటరున్నర దూరం వాకింగ్ ట్రాక్ కోసం మట్టిరోడ్డు పనులు రూ.22 లక్షలు, రూ.15 లక్షలతో వాచ్‌టవర్, వాచ్‌మెన్ గది కోసం రూ.7 లక్షలు, కమాన్, సాసర్‌పీట్లు ఇతరత్రా పనులకోసం మిగతా నగదును ఖర్చు చేయడమైందని అటవీశాఖ అధికారులు తెలిపారు. అందులో ప్రస్తుతం మంచినీటి బోర్లు, బెంచీలు, మరుగుదొడ్లు, అక్కడక్కడ మంచినీటి నల్లాల బిగింపు తదితర కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. పార్కు పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావాలంటే సుమారు రూ.2 కోట్ల పైచిలుకు అత్యవసరం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.


అర్బన్‌పార్కులో ఏర్పాటుచేసిన వాచ్‌టవర్

నిధులు కొరతతో పనులు నిలిచాయి

అర్బన్ పార్కులో అరకొరగా మిగిలిన పనులు పూర్తిచేయాలంటే నిధులు అవసరం. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు, నాయకులకు విన్నవించాం. నిధులను మంజూరు చేస్తే అత్యవసరం ఉన్నవాటికి ఖర్చు చేసి వినియోగంలోకి తెచ్చేలా కృషి చేస్తాం. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా పనులు ఆగిపోయాయి. జహీరాబాద్ పట్టణానికి చేరువలో అర్బన్ ఏర్పాటు కావడం వల్ల ప్రజలకు ఉపయోగకరంగా మారనున్నది.

- రాధికారెడ్డి, జహీరాబాద్ ఫారెస్ట్ రేంజ్ అధికారి

మృగశిర కార్తె రోజు విషాదం


రాంచంద్రయ్య (ఫైల్)

- చేపల వేటకు వెళ్లి ఒకరి మృతి

కౌడిపల్లి, జూన్ 8: మృగశిర కార్తెను పురస్కరించుకుని చేపల వేటకు వెళ్లిన వ్యక్తి కాళ్లకు వల చుట్టుకోవడంతో శనివారం సాయంత్రం మృతిచెందాడు. కౌడిపల్లి మండలం పరిధిలోని రాజిపేట్‌కు చెందిన బాంచ రాంచంద్రయ్య(58) మృగశిర కార్తె సందర్భంగా గ్రామ సమీపంలోని చెరువులో గ్రామస్థులు చేపలు పడుతున్నారు. రాంచంద్రయ్య కూడా వెళ్లడంతో ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకుని మునిగిపోయాడు. అక్కడే ఉన్నవారు గమనించి కాపాడే ప్రయత్నం చేసినా ఎలాంటి ఫలితం లేదు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు బాలకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

పెద్దశంకరంపేట, జూన్ 8: కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన పెద్దశంకరంపేటకు చెందిన నాందేడ్ యాదగిరి(31)కి భార్య ఉష, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. యాదగిరి తరచూ మద్యం సేవించి భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో భార్య కొన్నిరోజుల క్రితం పిల్లలతో కలిసి అమ్మగారి ఇంటికి వెళ్లింది. రెండురోజుల క్రితం పెద్ద మనుషులు మాట్లాడి ఉషను ఇంటికి తీసుకొచ్చారు. కాగా శుక్రవారం రాత్రి యాదగిరి మళ్లీ మద్యం సేవించి గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఇంట్లోకి వెళ్లిన యాదగిరి తలుపులు పెట్టుకున్నాడు. ఉదయం 7 గంటల వరకూ బయటకురాకపోవడంతో అనుమానంతో తలుపులు తీయగా.. ఉరేసుకుని మృతిచెందాడన్నారు. భార్య ఉష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం


నర్సింహులు మృతదేహం

తూప్రాన్, జూన్ 8: చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభించింది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డికి చెందిన నర్సింహులు(50) కత్తులకు పదును పెడుతూ తూప్రాన్‌లో జీవనం సాగిస్తున్నాడు. మృగశిర కార్తె కావడంతో తూప్రాన్‌కు చెందిన మరో ఇద్దరు టీకు పోచయ్య, జెడిగాడి దేవందర్‌లతో కలిసి శుక్రవారం చేపలు పట్టేందుకు కొత్తచెరువుకు వద్దకు వెళ్లారు. నర్సింహులు గాలం చెరువులో జారిపోవడంతో వెతికేందుకు వెళ్లి మునిగిపోయాడు. శుక్రవారం తూప్రాన్ పోలీసులు గాలింపు చేపట్టినా ఫలితం లేకుండాపోయింది. శనివారం తిరిగి గాలించగా నర్సింహులు మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రమాదకరంగా మూలమలుపు


కొల్లూరు-ఈదులనాగులపల్లి రహదారిపై ఉన్న ప్రమాదకర మలుపు

రామచంద్రాపురం, జూన్ 8: తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరు-ఈదుల నాగులపల్లి రోడ్డు ప్రమాదకరంగా మారింది. 60 ఫీట్ల వెడల్పుతో ఆర్అండ్‌బీ ఈ రోడ్డును ఏర్పాటు చేసింది. ఇటీవల రోడ్డుకు ఇరువైపులా బహుళ అంతస్తుల నిర్మాణాలను చేపడుతున్నారు. అదే మలుపు వద్ద నిర్మాణదారులు రోడ్డుకు ఆనుకుని పార్కింగ్ చేస్తున్నారు. వాహనదారులు తమ స్థలంలోకి రాకుండా సెక్యూరిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఫలితంగా ఎదురుగా వచ్చే ప్రయాణికులకు రోడ్డు కనిపించడం లేదు. పైగా నిర్మాణ పరికరాలు తరలించే భారీ వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఏర్పడుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మలుపు వద్ద ప్రమాద హెచ్చరిక సూచికలను ఏర్పాటు చేయాలని, లేదా నక్షాలో ఉన్న రోడ్డును గుర్తించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

భూ వివాదంలో ఇద్దరిపై కేసు

శివ్వంపేట, జూన్ 8: పట్టా భూమిలోకి ప్రవేశించి కడీలు పాతి భూమిని ట్రాక్టర్‌తో దున్నిన వ్యక్తులపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెద్ద గొట్టిముక్కల గ్రామ శివారులో సర్వే నంబర్ 70లో హైదరాబాద్‌కు చెందిన సన్నగారి మధుసూదన్‌రెడ్డికి 3 ఎకరాల 2 గుంటల భూమి ఉన్నది. అలాగే అదే సర్వే నంబర్‌లో శ్రీలతారెడ్డి, రాజేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డిలకు సంబంధించిన భూమి కూడా ఉన్నది. అయితే గ్రామానికి చెందిన మామిడి నర్సారెడ్డి, తమ్ముడు సత్తిరెడ్డి ఇద్దరూ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కడీలు పాతి ట్రాక్టర్‌తో దున్నారని మధుసూదన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు నర్సారెడ్డి సత్తిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

మరో ఘటనలో తమ్ముడిపై దాడి, అన్నపై కేసు

భూ వివాదంలో తమ్ముడిపై దాడిచేసిన అన్నపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని దంతాలపల్లి గ్రామానికి చెందిన నిమ్మల యశ్వంతరావు, కొండలరావు అన్నదమ్ముళ్లకు సర్వేనెంబర్ 176, 178లో బావి గడ్డ పొత్తుల ఉన్నది. ఆ బావి గడ్డను అన్న కొండలరావు ఎక్స్‌కవేటర్ సహాయంతో శనివారం పూడ్చేస్తుండడంతో తమ్ముడు యశ్వంతరావు, వారి కుమారులు ఎందుకు పూడ్చేస్తున్నావని అడిగారు. దీంతో కొండలరావు బూతు మాటలు తిట్టడంతో పాటు తమ్ముడు యశ్వంతరావుపై దాడిచేయడంతో గాయమైంది. యశ్వంతరావు ఫిర్యాదు మేరకు కొండలరావు, ఇతని ఇద్దరు కుమారులతో పాటు, కొండలరావు వద్ద పనిచేస్తున్న పోచయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

రామోజీరావు మృతి పట్ల టీడీపీ సంతాపం

సంగారెడ్డి అర్బన్, జూన్ 8: ప్రముఖ పత్రికాధిపతి, పారిశ్రామికవేత్త రామోజీరావు మృతి పట్ల టీడీపీ మెదక్ పార్లమెంట్ అధ్యక్షుడు ఇళ్లెందుల రమేశ్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. రామోజీరావు మృతి చాలా బాధాకరమన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. రామోజీరావు సేవలు మరువలేనివని, ఆయన ఎన్నో సంస్థలు స్థాపించి వేల మందికి ఉపాధి కల్పించిన మహనీయుడని, ముఖ్యంగా జర్నలిజం, మీడియా రంగంలో ఆయన చేసిన సేవలు ఆదర్శమని కొనియాడారు.

ఎస్జీటీలకు పదోన్నతుల్లో నష్టం

- ఎస్జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం

వెల్దుర్తి, జూన్ 8: ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించడంలో మల్టీ క్యాడర్ సంఘాలు పట్టించుకోవడం లేదని ఎస్జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బాషాపండిత పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ అర్హత కలిగిన ఎస్జీటీలకు వాటా కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎస్జీటీల్లో డీఎస్సీ 2000 వారికి పదోన్నతులు రావని, భాషాపండితులు, పీఈటీలు డీఎస్సీ 2017 వరకు స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందుతారని, ఇది న్యాయమా అని మల్టీ క్యాడర్ సంఘాలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

యూనిఫామ్స్ సిద్ధం

మనూరు, జూన్ 8: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపించాల్సిన దుస్తులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఐకేపీ డీపీఎం జయశ్రీ అన్నారు. మనూరు ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల కేంద్రాన్ని ఆమె సందర్శించారు.

ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన అవసరం: ఎమ్మెల్యే


చల్లగిద్దతండాలో వార్షికోత్సవంలో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 8: ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన అవసరమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చల్లగిద్దతండాలో నిర్వహిస్తున్న త్రయాహ్నిక జగదాంబ మాత, సేవాలాల్ మహరాజ్, రాంరావ్ మహరాజ్ ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనులు, సేవాలాల్ మహరాజ్, రాంరావ్ మహరాజ్‌ల సిద్ధాంతాలను పాటిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ ఎంపీపీ చాందిబాయిచౌహాన్, తహసీల్దార్ రాణాప్రతాప్, సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, పండిత్ నాయక్, రాజునాయక్ పాల్గొన్నారు. అలాగే బీబీపేటకు చెందిన జనార్ధన్‌రెడ్డి, తుక్యానాయక్‌తండాకు చెందిన జమిలీబాయిల పాడి గేదెలు విద్యుదాఘాతంతో మృతిచెందడంతో వారికి విద్యుత్‌శాఖ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను ఎమ్మెల్యే అందించారు. ఈ కార్యక్రమంలో బండారి సాయిలు, శివారెడ్డి, టిక్యానాయక్, రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

సురేష్ షెట్కార్‌కు ఫోన్‌లో ప్రియాంక గాంధీ అభినందన


ప్రియాంక గాంధీతో ఫోన్‌లో మాట్లాడుతున్న సురేష్‌షెట్కార్

నారాయణఖేడ్, జూన్ 8: జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన సురేష్‌షెట్కార్‌ను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ శనివారం ఫోన్‌చేసి అభినందించారు. బీజేపీ వారు కులాలు, మతాల పేరిట రాజకీయాలు చేసినప్పటికీ, ఆదిలాబాద్ నుంచి మహబూబ్‌నగర్ వరకు ఉత్తర తెలంగాణలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి గెలుపొందినందుకు షెట్కార్‌ను ప్రియాంకగాంధీ ఈ సందర్భంగా అభినందించారు.

ఎంపీలను కలిసిన మాజీ మున్సిపల్ చైర్మన్


ఈటలకు శుభాకాంక్షలు తెలుపుతున్న మురళీధర్

నర్సాపూర్, జూన్ 8: కొత్తగా ఎంపీకైన బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, బండి సంజయ్‌లను నర్సాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్ శనివారం ఢిల్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట అసెంబ్లీ కన్వీనర్ సతీష్‌యాదవ్ ఉన్నారు.

యూనిఫాంల పంపిణీ

కొల్చారం, జూన్ 8: కొల్చారం మండలం రాంపూర్ గ్రామపంచాయతీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 38 మంది విద్యార్థులకు సంబంధించిన యూనిఫాంలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు శనివారం అందజేశారు.

బుసారెడ్డిపల్లి ఘనంగా పోచమ్మకు బోనాలు


గ్రామ పురవీధుల గుండా బోనాలను ఊరేగిస్తున్న మహిళలు

మునిపల్లి/కల్హేర్, జూన్ 8: మండల పరిధిలోని బుసారెడ్డిపల్లి గ్రామంలోని నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పోచమ్మతల్లికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో గ్రామ పురవీధుల గుండా డప్పుచప్పుళ్ల మధ్య ఆలయం వరకు చేరుకొని గుడి చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. అలాగే కల్హేర్ మండల పరిధిలోని పోమ్యానాయక్‌తండా భవానీమాత, సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయాల వార్షికోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా భవానీమాత, సంత్ సేవాలాల్ మహరాజ్ విగ్రహాలకు అభిషేకంతో పాటు హోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్, తండా మాజీ సర్పంచ్ చిత్తిబాయి, మాజీ ఉపసర్పంచ్ జగ్‌రాం, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చేప మందు ప్రసాదానికి పోటెత్తిన జనాలు



చేప ప్రసాదాన్ని వేస్తున్న తడకంటి కుటుంబసభ్యులు

నారాయణఖేడ్, జూన్ 8: నారాయణఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేటలో ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు తడకంటి కుటుంబసభ్యులు మృగశిర కార్తె సందర్భంగా శనివారం చేపమందు ప్రసాదం పంపిణీ చేయడంతో ప్రజలు పోటెత్తారు. 82 ఏళ్లుగా చేప ప్రసాదాన్ని పంపిణీ చేస్తూ వస్తున్నారు. ఈ ప్రాంతవాసులే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రలకు చెందినవారు వస్తుంటారని తెలిపారు. ఈ సందర్భంగా తడకంటి పర్వాగౌడ్, తడకంటి లింగాగౌడ్, నాగరాజ్ గౌడ్, సాయిబాబాగౌడ్, వెంకటేష్‌గౌడ్ చేప మందు ప్రసాదాన్ని తినిపించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్ పాల్గొన్నారు.

చిరుత కాదు.. అన్నీ పుకార్లే

- ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ షాహిని

హత్నూర, జూన్ 8: మండల కేంద్రమైన హత్నూర శివారులో గల మల్లన్న గుట్టల్లో చిరుత పులి సంచరించినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, కేవలం పుకార్లేనని ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ షాహిని తెలిపారు. శనివారం మల్లన్నగుట్ట ప్రాంతాన్ని షాహిని, బీట్ ఆఫీసర్ సంతోష క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ షాహిని మాట్లాడుతూ ఎవరో కావాలనే పుకార్లు లేపారు.. తప్పా చిరుత ఆనవాళ్లు ఎక్కడా కనిపించలేదన్నారు. కుక్కలు తిరిగినట్టు మాత్రమే ఉన్నాయని, ఎక్కడ పులి జాతికి సంబంధించిన జంతువుల ఆనవాళ్లు లేవని చెప్పారు. ప్రజలు ఎవరూ భయాందోళనకు గురికావొద్దని పేర్కొన్నారు.


నీటికోసం వేచిచూస్తున్న తండావాసులు

జయరాంతండాలో నీటి ఇబ్బందులు

నర్సాపూర్, జూన్ 8: నర్సాపూర్ మండలం జయరాంతండాలో వారంరోజులుగా తీవ్ర నీటి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వారంరోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోవడమే కాకుండా స్థానికంగా ఉన్న సింగిల్‌ఫేజ్ మోటార్ కూడా కాలిపోయిందని తెలిపారు. ఈ విషయం స్థానిక పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో సమీపంలోని పొలాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.


పాడైన పంచాయతీ సింగిల్ ఫేస్ మోటార్

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే



సంగారెడ్డిలోని బాబానగర్‌లో బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నాగల్‌గిద్ద, జూన్ 8: విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని దామర్‌గిద్దలో బడిబాటకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. దీంతోపాటు విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీకాంత్, ఎంపీటీసీ పండరినాథ్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

●**సంగారెడ్డి అర్బన్:** సంగారెడ్డిలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఉత్సాహంగా సాగుతున్నది. ఇందులో భాగంగా పట్టణంలోని బాబానగర్, పోలీస్‌లైన్ వీధుల్లో ప్రధానోపాధ్యాయుడు మనోహర్, సీఆర్పీ దత్తులు కలిసి ప్రచార ర్యాలీ నిర్వహించారు.

●**మునిపల్లి:** మునిపల్లి మండల పరిధిలోని అంతారం గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బాల్‌రాజ్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. బడీడు పిల్లలను చేర్పించాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు.

●**కల్హేర్:** బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కల్హేర్ మండల విద్యాధికారి శంకర్ తల్లిందండ్రులను కోరారు. మండల పరిధిలోని రాపర్తిలో శనివారం బడిబాట ర్యాలీ నిర్వహించారు.

●**మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలం కోనాయపల్లి పిటి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మఒడి పథకంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

●**కొల్చారం:** కొల్చారం మండలం సంగాయిపేట సక్రియతండా, పలుగుతండాలో బడిబాటలో భాగంగా పలువురు విద్యార్థులకు ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు శనివారం అడ్మిషన్స్ ఇప్పించారు. అలాగే పలుగుతండాలో చదువు మానేసిన నలుగురు విద్యార్థులను గుర్తించి తల్లితండ్రులను ఒప్పించి 9వ తరగతిలో ముగ్గురికి, 7వ తరగతిలో ఒకరికి కస్తూర్బా పాఠశాలలో ఎంఈవో మాట్లాడి సీటు ఇప్పించారు. పంచాయతీ కార్యదర్శి నాగరత్నం, తండా ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.